బుల్డోజర్ న్యాయమంటే..

## చట్టాలను తుంగలో తొక్కడమే



### నిందితుల ఇళ్లను కూల్చడం సరికాదు

సుప్రీంకోర్టు మరోసారి ఆగ్రహం

న్యూఢిల్లీ: బుల్డోజర్ న్యాయంపై సర్వోన్నత న్యాయస్థానం మరోసారి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అక్రమ కట్టడాల పేరుతో ప్రజల ఇండ్లపైకి ప్రభుత్వాలు బుల్డోజర్లను పంపిస్తుండటాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. క్రిమినల్ కేసులో ప్రమేయం ఉందనే ఆరోపణలు ఉండటం ఆ నిందితుల ఇండ్ల కూల్చివేతకు తగిన కారణం కాబోదని స్పష్టం చేసింది. ఇటువంటి చర్యలను దేశ చట్టాలను తుంగలో తొక్కడంగా పరిగణించవచ్చునని హెచ్చరించింది. గుజరాత్‌లోని ఖేదా జిల్లాకు చెందిన జావేద్ అలీ మెహబూబా మియా సయీద్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం గురువారం ఈ హెచ్చరిక చేసింది. సయీద్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, కత్లాల్ గ్రామ రెవిన్యూ రికార్డుల ప్రకారం తన క్లయింటు ఓ భూమికి సహ యజమాని అని చెప్పారు. ఆ భూమిలో ఇంటిని నిర్మించుకోవడానికి గ్రామ పంచాయతీ 2004లో అనుమతి ఇచ్చిందన్నారు. రెండు దశాబ్దాల నుంచి మూడు తరాలు ఆ ఇంటిలో నివసిస్తున్నట్లు తెలిపారు. సుప్రీంకోర్టు ఈ నెల 2న జారీ చేసిన ఇండ్ల కూల్చివేత కోసం అనుసరించవలసిన మార్గదర్శకాలను కూడా ప్రస్తావించారు. ఇరు పక్షాల వాదనలను విన్న సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం స్పందిస్తూ, ప్రభుత్వాల చర్యలు చట్టాలకు అనుగుణంగా ఉండవలసిన దేశంలో, ఓ కుటుంబంలోని ఓ వ్యక్తి ఏదైనా కేసులో ఆరోపణలు ఎదుర్కొంటుండటాన్ని కారణంగా చూపించి, ఆ కుటుంబంలోని ఇతర వ్యక్తులకు, వారు చట్టబద్ధంగా నిర్మించుకున్న ఇంటికి వ్యతిరేకంగా చర్యలు తీసుకోరాదని స్పష్టం చేసింది. నేరంలో ప్రమేయం ఉందనే ఆరోపణలు ఆ నిందితుని ఇంటిని కూల్చివేయడానికి తగిన కారణం కాబోవని వివరించింది. సయీద్‌పై కేసు న్యాయస్థానంలో రుజువు కావలసి ఉందని తెలిపింది. చట్టమే సర్వోన్నతమైన దేశంలో ఇటువంటి కూల్చివేత బెదిరింపులను చూసీచూడనట్లు కోర్టు ఉండటం సాధ్యం కాదని చెప్పింది. ఇటువంటి చర్యలను చట్టాలపైకి బుల్డోజర్లను తోలడంగా పరిగణించవచ్చునని తెలిపింది. సయీద్ పిటిషన్‌పై నాలుగు వారాల్లోగా సమాధానం చెప్పాలని గుజరాత్ ప్రభుత్వానికి నోటీసు ఇచ్చింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు సయీద్ ఇంటిని కూల్చవద్దని ఆదేశించింది.

సీజేఐ ఇంట గణపతి పూజకు మోదీ..

## అధికార, విపక్షాల వాగ్యుద్ధం

న్యూఢిల్లీ: సీజేఐ చంద్రచూడ్ నివాసంలో జరిగిన గణపతి పూజకు ప్రధాని మోదీ హాజరవడం వివాదాస్పదమైంది. సీజేఐ పక్షపాత వైఖరిని విపక్షాలు ప్రశ్నించాయి. సీజేఐ ఇంట్లో జరిగిన పూజకు ప్రధాని మోదీ హాజరవ్వడం న్యాయవ్యవస్థ నిష్పాక్షపాతంపై ప్రజల్లో సందేహాలు ఏర్పడే అవకాశాలున్నాయని శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. కాగా, తనదే అసలైన శివసేన అంటూ ఏక్‌నాథ్ షిండే ప్రకటించడాన్ని సవాల్ చేస్తూ ఉద్ధవ్ ఠాక్రే వర్గం దాఖలు చేసిన కేసు విచారణ నుంచి సీజేఐ దూరంగా ఉంటే మంచిదని ఆయన సూచించారు. ఎందుకంటే ఈ కేసులో ప్రధాని మోదీ మరో పార్టీగా ఉన్నారని అన్నారు. ఇప్పుడు ఒక పార్టీతో సీజేఐ సన్నిహితంగా ఉన్న విషయం బహిరంగంగా అందరికీ తెలిసిందని, అలాంటి పరిస్థితులలో సీజేఐ తమకు న్యాయం చేయగలరా? అని ఆయన సందేహం వ్యక్తం చేశారు. బద్లాపూర్ లైంగికదాడి కేసులో ఏ మాత్రం స్పందించని సుప్రీంకోర్టు .. కోల్‌కతా డాక్టర్ హత్యాచారం కేసును మాత్రం సుమోటోగా తీసుకోవడాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా విపక్షాలకు వ్యతిరేకంగా ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులను ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇదే అంశంపై ఇతర ఎంపీలు మిలింద్ దేవర, ప్రియాంక చతుర్వేది కూడా ఘాటుగా విమర్శలు చేశారు. ఆ కార్యక్రమం కేవలం గణపతి పూజకే పరిమితమైందని, దీనిని శివసేన (యూబీటీ) అనవసరంగా రాజకీయం చేస్తున్నదని బీజేపీ జాతీయ కార్యదర్శి బీఎల్ సంతోశ్ విమర్శించారు.

# ఏచూరి ఇక లేరు

- ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్‌తో చికిత్స పొందుతూ మృతి
- 2015 నుంచి సీపీఎం ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు
- విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో రాణింపు
- రాష్ట్రపతి, ప్రధాని సహా పలువురు ప్రముఖుల సంతాపం
- పరిశోధనల కోసం ఎయిమ్స్‌కు మృతదేహం దానం



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12: ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి గురువారం మధ్యాహ్నం కన్నుమూశారు. ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్‌తో ఆయన గత నెల 19 నుంచి ఢిల్లీలోని ఎయిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. ఏచూరి వయసు 72 ఏండ్లు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వామపక్ష నేత మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సహా పలువురు జాతీయ, రాష్ట్ర నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు. ఏచూరి భౌతిక కాయాన్ని వైద్య పరిశోధనల నిమిత్తం ఎయిమ్స్‌కు దానం చేస్తున్నట్టు ఆయన కుటుంబం ప్రకటించింది. అంతకు ముందు ఆయన భౌతిక కాయాన్ని శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ప్రజల సందర్శనార్థం ఢిల్లీలోని సీపీఎం ప్రధాన కార్యాలయంలో ఉంచనున్నట్టు పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో రాణించిన ఏచూరి దేశంలో మార్క్సిస్టు సిద్ధాంతకర్తగా పేరొందారు. ఏచూరి 2015 నుంచి సీపీఎం ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. అతి చిన్న వయసులోనే పార్టీ కేంద్ర కమిటీకి ఎన్నికైన ఆయన 1992 నుంచి పొలిట్‌బ్యూరో సభ్యునిగా ఉన్నారు. 2005 నుంచి 2017 వరకు రెండు పర్యాయాలు పశ్చిమ బెంగాల్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. 2017లో ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ఎంపికయ్యారు.

**తెలుగు కుటుంబంలో జననం**

సీతారాం ఏచూరి పూర్వ మద్రాస్ రాష్ట్రంలో 1952 ఆగస్టు 12న తెలుగు కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి సర్వేశ్వర సోమయాజుల ఏచూరి ఏపీఎస్‌ఆర్టీసీలో ఇంజినీర్‌గా పనిచేశారు. తల్లి కల్పకం ఏచూరి ప్రభుత్వ ఉద్యోగి. ఏపీ ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వ ప్రధానకార్యదర్శిగా పనిచేసిన మోహన్‌కందాకు ఏచూరి మేనల్లుడు. పుట్టింది మద్రాస్‌లోనే అయినా ఆయన హైదరాబాద్‌లోని ఆల్ సెయింట్స్ హైస్కూల్‌లో విద్యాభ్యాసం చేశారు. 1969లో తెలంగాణ ఉద్యమం సమయంలో ఆయన ఢిల్లీ వెళ్లి సీబీఎస్‌ఈ హయ్యర్ సెకండరీ పరీక్షల్లో ఆల్ ఇండియా మొదటి ర్యాంక్ సాధించారు. ఢిల్లీలోనే సెయింట్ స్టీఫెన్స్ కాలేజీలో బీఏ (ఆనర్స్), జేఎన్‌యూలో ఎంఏ చదివారు. ఎమర్జెన్సీ కాలంలో అరెస్టయిన కారణంగా ఆర్థిక శాస్త్రంలో ఆయన పీహెచ్‌డీని పూర్తిచేయలేకపోయారు. ఏచూరి భార్య సీమా చిస్తీ 'ది వైర్' వెబ్ పోర్టల్‌కు సంపాదకురాలు కాగా, కుమార్తె అఖిల ఏచూరి ఎడిన్‌బర్గ్, సెయింట్ ఆండ్రూస్ యూనివర్సిటీలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు.

**రాజకీయ జీవితం**

సీపీఎం విద్యార్థి సంఘమైన ఎస్‌ఎఫ్‌ఐలో ఏచూరి 1974లో చేరారు. ఆ మరుసటి సంవత్సరమే ఆయన సీపీఎం సభ్యుడయ్యారు. ఎమర్జెన్సీ తరువాత 1977-78లో జేఎన్‌యూ విద్యార్థి యూనియన్‌కు మూడుసార్లు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. తన సహచర కామ్రేడ్ ప్రకాశ్ కారత్‌తో కలిసి జేఎన్‌యూను దుర్భేద్యమైన వామపక్ష కోటగా నిర్మించేందుకు కృషి చేశారు. 1986 వరకు ఎస్‌ఎఫ్‌ఐలో కొనసాగిన ఏచూరి 1978లో ఆ విద్యార్థి సంఘానికి అధ్యక్షుడు అయ్యారు. 1992 నుంచి పార్టీ పొలిట్ బ్యూరో సభ్యునిగా కొనసాగుతున్న ఏచూరి 2015లో విశాఖపట్నంలో జరిగిన పార్టీ మహాసభలలో సీపీఎం ఐదో ప్రధానకార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ తరువాత 2018, 2022లో జరిగిన పార్టీ మహాసభల్లో తన పదవిని నిలబెట్టుకున్నారు.



ఖమ్మంలో ఏచూరికి నివాళులర్పిస్తున్న సీపీఎం నేత తమ్మినేని, తదితరులు

**సంకీర్ణ రాజకీయాలలో కీలకం**

సంకీర్ణ రాజకీయాలలో సీపీఎం మాజీ ప్రధాన కార్యదర్శి హరికిషన్ సింగ్ సూర్జిత్ నిర్వహించిన కీలక పాత్రను ఏచూరి మరింత ముందుకు తీసుకెళ్లారు. 1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడినప్పుడు కాంగ్రెస్ నేత చిదంబరంతో కలిసి కనీస ఉమ్మడి కార్యక్రమం (సీఎంపీ) ముసాయిదాను రూపొందించారు. 2004లో యూపీఏ ప్రభుత్వ ఏర్పాటు సమయంలో సంకీర్ణ కూటమి నిర్మాణంలో క్రియాశీలక పాత్ర పోషించారు. ఏచూరి మంచి వక్త, రచయితగా పేరొందారు. సీపీఎం పార్టీ పక్ష పత్రిక 'పీపుల్స్ డెమోక్రసీ'కి గత 20 ఏండ్లుగా సంపాదకునిగా ఉన్నారు. హిందుస్థాన్ టైమ్స్ పత్రికలో 'లెఫ్ట్ హ్యాండ్ డ్రైవ్' పేరుతో కాలమ్ రాస్తున్నారు.

### లౌకిక వాదానికి తీరని లోటు: కేసీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తేతెలంగాణ): సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పట్ల బీఆర్‌ఎస్ అధినేత కే చంద్రశేఖర్ రావు సంతాపాన్ని ప్రకటించారు. సామ్యవాద భావాలు కలిగిన ఏచూరి.. విద్యార్థి నాయకుడిగా, కమ్యూనిస్టు పార్టీకి కార్యదర్శిగా, రాజ్యసభ సభ్యునిగా అంచెలంచెలుగా ఎదిగి ప్రజాపక్షం వహించారన్నారు. వారి సేవలను ఈ సందర్భంగా కేసీఆర్ స్మరించుకున్నారు. ఏచూరి మరణం కార్మిక లోకానికి, లౌకిక వాదానికి తీరని లోటన్నారు. ఏచూరి మరణంతో శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**అరుదైన నేత ఏచూరి: కేటీఆర్**

సీతారాం ఏచూరి మరణ వార్త తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని కేటీఆర్ పేర్కొన్నారు. కమ్యూనిస్టు నాయకుడిగా ఏచూరి జీవితాంతం ప్రజల పక్షాన రాజీలేని పోరాటం చేశారన్నారు. రాజకీయాల్లో ఏచూరి ఎంతో హుందాగా ఉండేవారని గుర్తుచేశారు. రాజకీయాల్లో అలాంటి వ్యక్తులు అరుదుగా ఉంటారని తెలిపారు. సీపీఎంలోనే కాకుండా దేశ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏచూరి సృష్టించుకున్నారని పేర్కొన్నారు. ఈ కష్టసమయంలో ఏచూరి కుటుంబసభ్యులకు ధైర్యాన్ని ప్రసాదించాలని ఆయన ప్రార్థించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**దేశ రాజకీయాలకు తీరని లోటు: హరీశ్‌రావు**

ఏచూరి మృతి పట్ల మాజీ మంత్రి హరీశ్‌రావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఏచూరి చేసిన పోరాటాలు ఎప్పటికీ స్ఫూర్తి దాయకమని, ఆయన మరణం దేశ రాజకీయాలకు తీరని లోటని అన్నారు. రాజ్యసభ ఎంపీగా, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యునిగా, ఆర్థికవేత్తగా, సామాజిక కార్యకర్తగా ఆయన ఎంతో సేవ చేశారన్నారు. ఆయన లేని లోటు పూడ్చలేనిదన్నారు. ప్రజా సమస్యలు, దేశ సమస్యలను ప్రస్తావన చేసే ఒక గొంతు మూగబోయిందన్నారు. ఏచూరి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**పలువురి సంతాపం**

ఏచూరి మృతి పట్ల తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, మాజీ సీజేఐ ఎన్వీ రమణ, సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, మాజీ మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, సబితా ఇంద్రారెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, మాజీ ఎంపీలు వినోద్, రావుల చంద్రశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్, ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల ఓంకార్‌తో పాటు పలువురు ప్రముఖులు సంతాపాన్ని ప్రకటించారు.



## అయోధ్యలో భూ కుంభకోణం

- బీజేపీ పెద్దలు, ప్రభుత్వాధికారుల ప్రమేయం
- సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ ఆరోపణలు

లక్నో : శ్రీరామ జన్మభూమి అయోధ్యలో పెద్ద ఎత్తున భూ కుంభకోణం జరిగిందని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. ఆయన గురువారం ఆ పార్టీ అయోధ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ, అధికారంలో ఉన్న వారు విస్తృత స్థాయిలో అవినీతికి పాల్పడ్డారని, అందులో భాగమే భూమికి సంబంధించిన దోపిడీలని చెప్పారు. బీజేపీ నేతలు, అధికారులు భూ దోపిడీలకు పాల్పడ్డారన్నారు. ఈ చీకటి వాస్తవాలను బయటపెట్టినందుకు సమాజ్‌వాదీ పార్టీ కార్యకర్తలను అభినందించారు. అయోధ్య వంటి పవిత్రమైన స్థలంలోనే ఇటువంటి ఆక్రమణలకు పాల్పడ్డవారు, మిగతా జిల్లాల్లో ఇంకెన్ని దారుణాలకు పాల్పడి ఉంటారో ఊహించుకోవచ్చునని తెలిపారు. అయోధ్య అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని అన్నారు.

## రాహుల్‌గాంధీ పౌరసత్వంపై పిల్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12: కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్ గాంధీ బ్రిటిష్ పౌరసత్వాన్ని కలిగి ఉన్నారంటూ అలహాబాద్ హైకోర్టులో పిల్ దాఖలైంది. భారత న్యాయ సంహిత నిబంధనల కింద ఆయనపై కేసు నమోదు చేయాలని, సీబీఐతో పూర్తిస్థాయి విచారణ జరిపించాలంటూ పిటిషనర్ హైకోర్టును కోరారు. రాహుల్‌గాంధీ పౌరసత్వంపై ఆరోపణలు రావటం ఇదే మొదటిసారి కాదు. ఇదే విషయమై రాహుల్‌గాంధీకి వ్యతిరేకంగా బీజేపీ నాయకుడు సుబ్రమణ్య స్వామి ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. రాహుల్ గాంధీకి బ్రిటిష్ పౌరసత్వం ఉందని ఆయన కోర్టుకు ఆధారాలు అందజేశారు.

# రాజీనామాకు సిద్ధమే

- ప్రజల కోసం అవసరమైతే సీఎం పదవి నుంచి వైదొలుగుతా
- జూనియర్ డాక్టర్లతో చర్చల కోసం రెండు గంటలు వేచిచూశా
- అయినా వారి నుంచి స్పందన లేదు
- ప్రతిష్ఠంభన కొనసాగుతున్నందుకు ప్రజలకు క్షమాపణ చెబుతున్నా
- బెంగాల్ సీఎం మమతా బెనర్జీ



కోల్‌కతా, సెప్టెంబర్ 12: బెంగాల్‌లో ప్రభుత్వం, జూనియర్ డాక్టర్ల మధ్య ప్రతిష్ఠంభనకు గురువారం కూడా తెరపడలేదు. చర్చల నిమిత్తం జూనియర్ వైద్యులు పెట్టిన డిమాండ్లను బెంగాల్ ప్రభుత్వం నిర్ద్వంద్వంగా తిరస్కరించడంతో వైద్యులు చర్చా వేదికకు రావడానికి తిరస్కరించారు. దీంతో తీవ్ర అసంతృప్తికి గురైన సీఎం మమతా బెనర్జీ ప్రజల కోసం తన పదవికి రాజీనామా చేయడానికి సిద్ధమని ప్రకటించారు. డాక్టర్లతో చర్చల కోసం రెండు గంటల పది నిముషాల పాటు వేచి చూసిన ఆమె.. తర్వాత మీడియాతో మాట్లాడారు. 'నేను పదవిని లెక్క చేయను. ప్రజల కోసం రాజీనామా చేయడానికి సిద్ధం. అయితే జూనియర్ వైద్యుల సమ్మె కారణంగా నెల రోజులుగా స్తంభించిన వైద్య సేవల పునరుద్ధరణ జరిగి సాధారణ పరిస్థితులు నెలకొనాలని కోరుకుంటున్నాను' అని ఆమె పేర్కొన్నారు. 'కోర్టు పరిధిలో ఉన్న అంశాలు బహిరంగ పరచడం చట్ట విరుద్ధం. అందుకే చర్చలను లైవ్ టెలికాస్ట్ చేయాలంటూ వారు పెట్టిన డిమాండ్‌ను తిరస్కరించా. అయితే చర్చలను రికార్డు చేయడానికి మూడు కెమెరాలు ఏర్పాటు చేశా' అని మమత తెలిపారు. 'సమస్యను పరిష్కరించడానికి నేను చేయాల్సిన ప్రయత్నమంతా చేశా. బాధితురాలికి న్యాయం జరగాలని కోరుకుంటున్నా. అయితే వైద్యులను చర్చలకు రప్పించడంలో విఫలమైనందుకు, ఇన్ని రోజులుగా ఇబ్బందులు పడుతున్న ప్రజలకు క్షమాపణ చెబుతున్నా. చర్చలకు వెళ్లవద్దంటూ జూనియర్ డాక్టర్లకు కొంత మంది వ్యక్తుల నుంచి ఆదేశాలు వస్తున్నాయి.' అని ఆమె అన్నారు.

**రాజీనామా కోరలేదు..**

సీఎం వ్యాఖ్యలను జూనియర్ వైద్యులు ఖండించారు. ఆమె తన పదవి రాజీనామా గురించి ప్రస్తావించడం తీవ్ర అసంతృప్తికి గురి చేసిందని, రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో ఇక్కడకు రాలేదని అన్నారు. ఇప్పటికీ చర్చల ద్వారానే తమ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నామన్నారు. ఎక్కడ చర్చలు నిర్వహించినా రావడానికి తాము సిద్ధమేనని స్పష్టం చేశారు.

ఆర్మీ అధికారులపై దాడి..

## స్నేహితురాలిపై గ్యాంగ్ రేప్

మధ్యప్రదేశ్‌లో దారుణం

ఇండోర్: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. పిక్నిక్‌కు వచ్చిన ఇద్దరు ట్రైనీ ఆర్మీ ఆఫీసర్లపై కొందరు దుండగులు దాడి చేసి, వారి స్నేహితురాళ్లలో ఒకరిపై సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. చుట్టూ అడవులు, కొండలతో నిండి ఉన్న ఇండోర్ జిల్లా మౌవ్ పట్టణంలోని జామ్‌గేట్‌లో బుధవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. మౌవ్ ఆర్మీ కాలేజీలో శిక్షణ పొందుతున్న 23, 24 ఏండ్ల ఇద్దరు ఆర్మీ అధికారులు మంగళవారం ఇద్దరు స్నేహితురాళ్లతో కలిసి పిక్నిక్‌కు వెళ్లారు. వీరిపై కొందరు దుండగులు దాడి చేశారు. వారి వద్ద సొమ్ము లాక్కున్నారు. వారిలో ఒక జంటను బందీగా చేసుకుని 10 లక్షలు ఇస్తేనే వదిలిపెడతామని డిమాండ్ చేశారు. తర్వాత వారు ఆ యువతిపై సామూహిక లైంగిక దాడి చేశారు. నిందితులు ఆరుగురు సమీపంలోని గ్రామాలకు చెందిన వారని ఎస్పీ హితికా వాసల్ చెప్పారు.

## అదానీ విద్యుత్తు ఒప్పందంపై సమీక్ష

### బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం నిర్ణయం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12: గత ప్రధాని హసీనా హయాంలో తీసుకున్న పలు నిర్ణయాలను బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం సమీక్ష చేస్తున్నది. అందులో భాగంగా అప్పట్లో అదానీ గ్రూప్‌తో జరుపుకున్న విద్యుత్తు ఒప్పందాన్ని నిశితంగా పరిశీలించాలని మహమ్మద్ యూనస్ ప్రభుత్వం నిర్ణయించింది. బంగ్లా రాజధాని ఢాకాకు తమ జార్ఖండ్ యూనిట్ నుంచి విద్యుత్తు సరఫరాకు 2017లో అదానీ సంస్థ చేసుకున్న ఒప్పందాన్ని పూర్తిగా పరిశీలిస్తారు. 'రెండు దేశాలు ఎలాంటి కాంట్రాక్టులపై సంతకాలు చేశాయి?, వాటి నిబంధనలు, నియమాలు ఏమిటి? తాము పొందుతున్న సేవలకు చెల్లిస్తున్న ధర సరైనదేనా? ఇప్పటివరకు ఈ ఒప్పందంలో భాగంగా అదానీ సంస్థలకు ఎంత చెల్లించారు? తదితర అంశాలన్నీ నిశితంగా పరిశీలిస్తాం. మా దేశ చట్టాలను ఉల్లంఘించే ఏ విదేశీ సంస్థ ఉండకూడదు' అంటూ ఒక సీనియర్ అధికారి పేర్కొన్నారు. అలాగని తాము ఏ ఒక్క భారత సంస్థను టార్గెట్ చేయడం లేదని ఆయన స్పష్టం చేశారు. 25 ఏండ్ల పాటు 1,496 మెగావాట్ల విద్యుత్తు కొనుగోలుకు అదానీ పవర్ (జార్ఖండ్) లిమిటెడ్‌కు బంగ్లాదేశ్ పవర్ డెవలప్‌మెంట్ బోర్డు మధ్య 2017 నవంబర్‌లో ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం అదానీ జార్ఖండ్ ప్లాంట్‌లో ఉత్పత్తి అయ్యే నూరు శాతం విద్యుత్తును బంగ్లా కొనుగోలు చేస్తుంది. ఇది బంగ్లాదేశ్ బేస్ లోడ్‌లో 7-10 శాతం. కాగా, గత ఏడాది అదానీ సంస్థ 7,508 మిలియన్ యూనిట్ల విద్యుత్తును బంగ్లాదేశ్‌కు ఎగుమతి చేసింది.

## 19-25 మధ్య నైరుతి తిరోగమనం: ఐఎండీ

*న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12: దేశంలో నైరుతి రుతు పవనాల తిరోగమనం ఈనెల 19 నుంచి 25 మధ్య మొదలవుతున్నదని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. దేశం నుంచి నైరుతు పవనాలు క్రమంగా వైదొలిగేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయంటూ ఐఎండీ గురువారం తెలిపింది. ఈ ఏడాది జూన్ 1తో మొదలైన నైరుతి సీజన్‌తో ఇప్పటివరకు, దేశంలో 836.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, సగటు వర్షపాతం (772.5 మిల్లీమీటర్లు)తో పోల్చితే 8శాతం ఎక్కువ వర్షం కురిసిందని ఐఎండీ వెల్లడించింది. దక్షిణ భారతంలో 25శాతం, మధ్య భారతంలో 19శాతం, వాయువ్య ప్రాంతంలో 4 శాతం సాధారణం కన్నా అధిక వర్షపాతం నమోదైంది. తూర్పు, ఈశాన్య ప్రాంతాల్లో సాధారణం కన్నా 16 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. నైరుతి రుతు పవనాలు ఏటా కేరళలో జూన్ 1న తీరాన్ని తాకుతాయి. జూలై 8 కల్లా దేశమంతా విస్తరిస్తాయి. సాధారణంగా సెప్టెంబర్ 17తో మొదలయ్యే నైరుతి తిరోగమనం, అక్టోబర్ 15 నాటికి పూర్తవుతుంది.*

## ఇద్దరు గ్రామస్థులను ఉరితీసిన నక్సలైట్లు

బీజాపూర్: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఇద్దరు గ్రామస్థులను నక్సలైట్లు ఉరి తీశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, జప్పెమర్క గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని, మడ్వి సుజ, పోడియం కోసలను మంగళవారం అపహరించి తీసుకెళ్లారు. జన అదాలత్‌ను నిర్వహించిన అనంతరం మడ్వి, పోడియంలను చెట్టుకు ఉరి వేసి హత్య చేశారు. ఈ హత్యలకు తమదే బాధ్యత అని భైరంగఢ్ ఏరియా మావోయిస్టు కమిటీ ప్రకటించింది. వీరిద్దరూ పోలీసు ఇన్ఫార్మర్లని ఆరోపించింది. ఈ సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

రష్యా సైన్యం నుంచి 45 మంది

## భారతీయులకు విముక్తి

న్యూఢిల్లీ: రష్యా సైన్యం నుంచి 45 మంది భారతీయులకు విముక్తి లభించినట్టు ఇండియన్ ఫారిన్ మినిస్ట్రీ గురువారం తెలిపింది. మరో 50 మందికి విముక్తి కల్పించేందుకు చర్యలు కొనసాగుతున్నట్టు వెల్లడించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జూలైలో రష్యాలో పర్యటించినపుడు భారతీయ సైనికులను విడుదల చేస్తామని రష్యా హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. తప్పుడు ప్రలోభాలకు గురై, తమ సైన్యంలో చేరి, నిర్బంధం వల్ల ఉక్రెయిన్ యుద్ధంలో పాల్గొంటున్న భారతీయులను డిశ్చార్జ్ చేస్తామని రష్యా చెప్పింది. ఈ హామీ మేరకు 45 మంది భారతీయులను సైన్యం నుంచి డిశ్చార్జ్ చేసింది.



## గ్యాస్ట్రిక్ సమస్యలతో పార్కిన్సన్ రెట్టింపు

*న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12: అల్సర్, గ్యాస్ట్రిక్ సహా జీర్ణక్రియ సంబంధ సమస్యలతో వణుకుడు రోగం 76 శాతం పెరిగే అవకాశం ఉన్నదని తాజా అధ్యయనంలో తేలింది. 9,350 మంది పేషెంట్లపై చేసిన పరిశోధనల్లో.. గ్యాస్ట్రిక్ సమస్యలతో బాధపడినవారు వృద్ధాప్యం వచ్చేసరికి వణుకుడు సమస్యలతో బాధపడినట్టు తమ అధ్యయనంలో తేలిందని అమెరికాలోని బెత్ ఇజ్రాయెల్ డీకోనెస్ మెడికల్ సెంటర్ శాస్త్రవేత్తలు తెలిపారు. మలబద్ధకం, కడుపు నిండుగా అనిపించటం లాంటి సమస్యలు తలెత్తి.. పార్కిన్సన్‌కు దారితీస్తాయని వెల్లడించారు. వృద్ధుల్లో పార్కిన్సన్ ఎక్కువగా కనిపించడానికి జీర్ణ సంబంధిత సమస్యలే ప్రధాన కారణమని శాస్త్రవేత్తలు చెప్తున్నారు.*




## ఒత్తిడి తర్వాత శుక్రకణాల్లో వేగం

*న్యూయార్క్, సెప్టెంబర్ 12: ఒత్తిడి వల్ల శుక్రకణాలు చలనశీలతను కోల్పోతాయని ఇప్పటివరకు చదువుకున్నాం. పునరుత్పత్తి వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలుసు. కానీ, ఒత్తిడిని జయించిన తర్వాత శుక్రకణాల్లో వేగం పెరుగుతుందని, పునరుత్పత్తి వ్యవస్థలో అండంతో ఫలదీకరణం ఆశాజనకంగా జరుగుతుందని తాజా అధ్యయనం తేల్చింది. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కొలరాడో అన్‌స్చుట్జ్ మెడికల్ క్యాంపస్ శాస్త్రవేత్తలు జరిపిన పరిశోధనల్లో.. ఒత్తిడిని జయించిన తర్వాత శుక్రకణాల చలనం ఆరోగ్యవంతంగా ఉన్నట్టు తెలిసింది. దాని ఫలితంగా జననాల రేటులో వృద్ధి కనిపించిందని పరిశోధకులు వివరించారు.*




## స్క్రీన్‌కు అతుక్కుపోతే.. పిల్లల భాషా నైపుణ్యంపై దెబ్బ

*న్యూఢిల్లీ: డిజిటల్ స్క్రీన్స్ (మొబైల్ ఫోన్లు, ల్యాప్‌ట్యాప్, ట్యాబ్, కంప్యూటర్లు)ను పెద్ద ఎత్తున వాడుతున్న కుటుంబాల్లోని పిల్లల్లో భాషా నైపుణ్యాలు దెబ్బతింటున్నాయని తాజా అధ్యయనం ఒకటి హెచ్చరించింది. పిల్లల మెదడు అభివృద్ధిపై వీడియో గేమ్స్ ప్రతికూల ప్రభావం చూపుతాయని 'ఎస్తోనియా' సైంటిస్టులు తెలిపారు. దీనిపై 'ఫ్రాంటియర్ ఇన్ డెవలప్‌మెంటల్ సైకాలజీ' కథనం ప్రకారం, రెండున్నర ఏండ్ల వయసు పిల్లలున్న తల్లిదండ్రుల నుంచి సేకరించిన సమాచారాన్ని సైంటిస్టులు విశ్లేషించారు. స్క్రీన్ టైమ్ తక్కువగా ఉన్న పిల్లలు.. పదజాలం, వ్యాకరణంలో అత్యధిక స్కోర్ చేయటం గమనార్హం. ఈ-బుక్స్ చదవటం, ఎడ్యుకేషనల్ గేమ్స్‌తో గడిపినా.. అది పిల్లలపై దుష్ప్రభావం చూపుతుందని అధ్యయనం తెలిపింది.*



## వుహాన్ ల్యాబ్ నుంచి కొవిడ్ 'నానో వ్యాక్సిన్'

*బీజింగ్ : కొవిడ్ 19 వైరస్ పుట్టుకకు ప్రధాన కేంద్రంగా ఉన్న చైనాలోని వూహాన్ ల్యాబ్ నుంచి కీలక ప్రకటన వెలువడింది. ఇప్పటివరకు పుట్టుకొచ్చిన కరోనా వైరస్‌లతోపాటు, భవిష్యత్తులో వచ్చే వేరియెంట్స్ అన్నింటినీ ఎదుర్కొనే నానో వ్యాక్సిన్‌ను తయారుచేసినట్టు 'వుహాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ' సైంటిస్టులు తాజాగా ప్రకటించారు. ఈమేరకు 'సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్' కథనం పేర్కొన్నది. దీని ప్రకారం, ప్రస్తుతం ఎన్నో వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నా, ఇవి సార్వత్రిక రక్షణ కల్పించలేవు. దీంతో 'నానో వ్యాక్సిన్'ను తయారుచేసినట్టు సైంటిస్టుల బృందం తెలిపింది. గబ్బిలాలు, ఇతర జంతువులపై పరిశోధనలు జరుపుతున్న ఈ ల్యాబ్ నుంచే కరోనా వైరస్ లీకైందని గతంలో పలు దేశాలు అనుమానం వ్యక్తం చేశాయి.*



## అంతరిక్షంలో తొలిసారి ప్రైవేట్ స్పేస్‌వాక్

*వాషింగ్టన్: స్పేస్‌ఎక్స్ పొలారిస్ డాన్ మిషన్ వ్యోమగామి బృందం ప్రపంచంలో మొట్టమొదటిసారిగా ప్రైవేట్ స్పేస్‌వాక్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. బిలియనీర్ జేర్‌డ్ ఐసాక్‌మ్యాన్ మొదట నడవగా ఆ తర్వాత స్పేస్‌ఎక్స్ ఇంజినీర్ సరహ్ గిల్లిస్ ఆయనను అనుసరించారు. అంతరిక్ష నడకను కేవలం 30 నిమిషాల పాటు నిర్వహించారు. కానీ దీనికి సిద్ధం కావడానికి రెండు గంటలు పట్టింది. ఈ కార్యక్రమంలో కొత్త అంతరిక్ష దుస్తులను పరీక్షించారు. ఐసాక్‌మ్యాన్ అంతరిక్షంలో ఉన్న ఫొటోను స్పేస్‌ఎక్స్ సీఈవో మస్క్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. టేకాఫ్ అయిన 15 గంటల తర్వాత 1400.7 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకొని పొలారిస్ డాన్ మిషన్ అరుదైన మైలురాయిని సాధించింది.*